Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699


# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU





అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 324 పేజీలు (Pages): 8 వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

మంగళవారం, 11 - 8 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం: 2015

# ఈ నెల వరకూ 32.22 లక్షల పుస్తకాలు రైతులకు అప్పగింత

## - పట్టాదారు పాస్ పుస్తకాలకు టెక్నాలజీ రక్షణ కవచం - పాత రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియ

## - కలిదిండిలో మీ భూమి- మీ హక్కు సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు










**కైకలూరు, (రాజధాని వార్తలు):** గత పాలనలో అస్తవ్యస్తంగా మారిన భూమి రికార్డుల ప్రక్షాళనకే రెవెన్యూ రికార్డుల రిఫార్మ్స్ 2026 తీసుకొచ్చామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రెవెన్యూ సమస్యల పరిష్కారమే అజెండాగా కూటమి ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు. 2027 నాటికి రీసర్వే ప్రక్రియను పూర్తి చేసి రైతులు, భూ యజమానులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తామని తెలిపారు. కైకలూరు నియోజకవర్గం కలిదిండిలో మీ భూమి-మీ హక్కు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఇ-కేవైసీ పూర్తి చేసిన అనంతరం నల్లజర్ల దుర్గా భవానీ అనే మహిళా రైతుకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాన్ని సీఎం జారీ చేశారు. రీసర్వే ప్రక్రియకు సంబంధించి కలిదిండిలో నిర్వహించిన గ్రామసభకు హాజరైనట్టుగా సీఎం రిజిస్టర్‌లో సంతకం చేశారు. అనంతరం ప్రజలు, రైతులను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."రాష్ట్రంలో, కేంద్రంలో డబుల్ ఇంజన్ సర్కారు బుల్లెట్ వేగంతో అభివృద్ధి చేస్తోంది. రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులకు ఇచ్చిన భూమిని 22ఏలో పెడితే దానిని పరిష్కరించి వారికి పట్టాలు ఇచ్చాం. మీ భూమి మీ హక్కు దానిపై ఇతరులు పెత్తనం చేయడానికి వీల్లేదు. పాస్ పుస్తకాలపై గత పాలకులు ఫోటోలు ఎలా వేసుకుంటారు. 2019-24 మధ్య గత పాలకులు చేసిన విధ్వంసం కారణంగా రెవెన్యూ రికార్డులు ధ్వంసం అయ్యాయి. వారికి ఇష్టం లేని వ్యక్తుల భూముల్ని, ఆస్తుల్ని డిజిటల్ గా 22ఏలో పెట్టేసి వివాదాస్పదం చేశారు. 2024లో అధికారంలోకి రాగానే ఎక్కడికి వెళ్లినా భారీ ఎత్తున భూ ఫిర్యాదులు అందాయి. అప్పుడే వీటన్నిటినీ పరిష్కరించాలని నిశ్చయించుకున్నాం. ఒక్కొక్కటిగా వాటిని పరిష్కరిస్తున్నాం. సమస్యలు పట్టించుకోని వారికి ప్రజలు 11 సీట్లు మాత్రమే ఇచ్చారు. గత పాలకులు బటన్ నొక్కటం, పరదాల చాటున రావటం, సభలు పెట్టి చెట్లు నరికేశారు. ప్రజల సమస్యలు తెలుసుకోవాలనే ప్రతీ నెలా సమావేశాల ద్వారా వారిని కలుస్తున్నాం. కరెన్సీకి ఉండే పటిష్టమైన భద్రతా ఫీచర్లను పట్టాదారు పాస్ పుస్తకాలకు కూడా అమలు చేస్తున్నాం. బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ద్వారా ఆస్తుల వివరాలను ట్యాంపర్ చేయకుండా భద్రత కల్పించాం. క్యూఆర్ కోడ్ సహా ఇతర సాంకేతిక పరమైన భద్రతా ఫీచర్లను ఏర్పాటు చేశాం. 32.32 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను ఇప్పటి వరకూ రైతులకు, భూ యజమానులకు అందించాం. వచ్చే ఏడు నెలల్లో 9365 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి 68.64 లక్షల పాస్ పుస్తకాలు జారీ చేస్తాం." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**రెవెన్యూ సంస్కరణలతో రైతులకు ప్రయోజనాలు**

"ఇప్పటి వరకూ 41 వేల ఎకరాల మేర భూ సమస్యలు క్లియర్ చేశాం. దీని ద్వారా 1.27 లక్షల మందికి పైగా రైతులు, పరిశ్రమలు, ప్రజలకు ప్రయోజన కలిగింది. 1.36 లక్షల ఎకరాలను ఫ్రీ హోల్డ్ చేశాం. ప్రతీ రైతుకు, భూ యజమానికి రాజ ముద్రతో కూడిన పట్టా దారు పాస్ పుస్తకాలు జారీ చేసే వరకూ విశ్రమించం. భూమి తమదైనా వేర్వేరు ఇబ్బందులతో రైతులు, భూ యజమానులు ఇప్పటి వరకూ సమస్యలు ఎదుర్కొన్నారు. 1బీ, అడంగల్, డీకేటీ, ఏఆర్సీ, ఇనామ్, సీలింగ్ లాంటి పాత భూమి రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియ చేపట్టాం. లింక్ డాక్యుమెంట్లన్నీ ఆన్ లైన్ ద్వారా అందిస్తాం. భూ రికార్డులను చట్టబద్దంగా నవీకరించి ధృవీకరించే ప్రక్రియను పకడ్బందీగా చేస్తున్నాం. 9 లక్షల మందికి ఇప్పటి వరకూ ఆటో మ్యూటేషన్ సౌకర్యం కల్పించాం. రీసర్వే ప్రక్రియను రైతుల సమక్షంలోనే చేసి ఈకేవైసీ తీసుకున్న తర్వాతే రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను ముద్రించి పంపిణీ చేస్తున్నాం. గ్రామ సభ నిర్వహించి పూర్తి పారదర్శకంగా పుస్తకాలను పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాం. రాష్ట్రంలో భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కరించాలన్నదే మా ఉద్దేశం. వివాదాలు తగ్గి లావాదేవీలు పెరుగుతాయి. ఐటీతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను అనుసంధానించి ప్రజలకు సులభంగా పౌర సేవలు అందేలా చర్యలు చేపట్టాం. కొల్లేరు వద్ద తాగునీటి సమస్యను పరిష్కరించేలా రూ.36 కోట్లను కైకలూరుకు మంజూరు చేశాం. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లో పదేపదే మరమ్మత్తులు వచ్చే రహదారులకు కూడా శాశ్వత పరిష్కారం ఉండేలా సిమెంట్ రోడ్లు వేయాలని ఆలోచన చేస్తున్నాం. గత పాలనలో గోతులు పడిన రోడ్ల గురించి ప్రశ్నిస్తే బటన్ నొక్కామని సమాధానం ఇచ్చేవారు. గత పాలన తాలూకు విధ్వంసపు గడ్డు రోజులను అధిగమించి క్రమంగా అభివృద్ధివైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్నాం. 2019-24 మధ్య రాష్ట్రం ఆర్ధికంగా ధ్వంసమైంది, ఇప్పుడు పశ్చిమాసియాలో యుద్ధం లాంటి పరిస్థితులు ఆక్వా రంగాన్ని దెబ్బతీశాయి. కానీ కూటమి వచ్చాక ఆక్వాకు రూ.1.50కు యూనిట్ చొప్పున రాయితీ విద్యుత్‌ను జోన్‌తో నిమిత్తం లేకుండా ఇస్తున్నాం. ప్రభుత్వానికి రూ.1150 కోట్ల అదనపు భారం పడినా.. దేశానికి ఆదాయం వచ్చేలా చేస్తున్న రైతుల కోసం దీనిని భరిస్తున్నాం. నాన్ ఆక్వా జోన్ పరిధిలోని 12,500 మంది రైతులకు కూడా కొత్తగా ఈ రాయితీ విద్యుత్ అమలు అవుతుంది." అని ముఖ్యమంత్రి వెల్లడించారు.

**పరామర్శల పేరుతో గొడ్డలిపార్టీ నానాయాగీ**

"ఓ దౌర్భాగ్యపు పార్టీ కుట్రలు, కుతంత్రాలు చేస్తోంది. గొడ్డలి పార్టీ వల్ల రాష్ట్ర ప్రజలు నష్టపోతున్నారు. నక్సల్స్ నాపై క్లైమోర్ మైన్స్ పేల్చినా కేవలం ప్రజల కోసమే రాజకీయాల్లో కొనసాగుతున్నాను. రాయలసీమలో ఫ్యాక్షన్, హైదరాబాద్‌లో మత విద్వేషాలను కూడా సమర్థంగా నియంత్రించాం. ఆ తర్వాతే రాష్ట్రంలో అభివృద్ధి జరిగి సంపద పెరిగింది. అంతర్జాతీయ స్థాయి కంపెనీలు వచ్చాయి. రాష్ట్రంలో గొడ్డలి పార్టీ వల్ల గంజాయి, రౌడీ బ్యాచ్ కారణంగా అరాచకాలు జరిగాయి. మేం అధికారంలోకి వస్తునే గంజాయి పంటను నిర్మూలించాం. దేవరపల్లి వద్ద పొగాకు రైతుల పరామర్శకు వెళ్లి నానా యాగీ చేశారు. స్వైర విహారం చేశారు. రోడ్లపై ప్రమాదకరంగా మోటారు సైకిళ్లతో సర్కస్ చేస్తూ భయపెడుతున్నారు. రైతుల పొగాకు మొత్తం తొక్కించారు. పొగాకు కేజీకి రూ.10 చొప్పున సబ్సిడీ ఇవ్వటంతో పాటు బ్యారెన్‌కు రూ.50 వేల రుణం ఇప్పించేలా కేంద్రంతో మాట్లాడాం. తప్పు చేస్తే మా పార్టీ వ్యక్తులైనా చర్యలు తీసుకుంటున్నాం. గుంటూరులో ఓ మహిళపై అసభ్యంగా ప్రవర్తించారని టీడీపీ నేతను సస్పెండ్ చేశాం. కేసు పెట్టి విచారణ చేస్తున్నాం. శ్రీకాకుళంలో ఓ మాజీ మంత్రి కొడుకు బైక్ తో గుద్ది ఓ వ్యక్తిని చంపేస్తే అతన్ని పరామర్శించడానికి గొడ్డలి పార్టీ అధ్యక్షుడు వెళ్లి అరాచకం చేశారు. ప్రధాన మంత్రి పర్యటన ఓ వైపు ఉంటే రోడ్లపై గంటలు గంటలు ర్యాలీ చేశారు. ఓ మహిళా పోలీసు అధికారిపై దాడి చేశారు. తిరిగి పోలీసులపై నెపం వేశారు. మెగా డీఎస్సీ ద్వారా 15 వేల టీచర్ల పోస్టులు భర్తీ చేస్తే దానిపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. పూర్తి మెరిట్ తో ఉద్యోగాలు సంపాదించిన యువతను కించ పరిచేలా గొడ్డలి పార్టీ వ్యవహరిస్తోంది. ఢిల్లీలో నీట్ పరీక్ష పేపరు లీక్ అయితే..ఇక్కడ కూడా లోకేష్ రాజీనామా చేయాలని అడ్డదిడ్డంగా మాట్లాడుతున్నారు. మెగా డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన టీచర్లు రోడ్లపైకి వచ్చి ర్యాలీ చేయాల్సిన పరిస్థితి వచ్చింది. పాఠాలతో పాటు గుణపాఠాలు కూడా చెబుతామని వాళ్లు హెచ్చరించారు. కర్నూలు కొండారెడ్డి బురుజు వద్ద గొడ్డలి పార్టీకి వ్యతిరేకంగా టీచర్లు ఆందోళన చేశారు. ఇంత చేసినా ఆ పార్టీకి బుద్ధిరావటం లేదు. ఇంకా ఆందోళన చేస్తాం, రోడ్లపై స్వైరవిహారం చేస్తామంటున్నారు. రప్పా రప్పా అంటూ గొడ్డలి పార్టీ రౌడీలు, గంజాయి బ్యాచ్‌లు ప్రజలకు నిద్ర లేకుండా చేస్తారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం కడితే అది నేనే కట్టాను అంటున్నాడు. పోలవరం పూర్తి అయితే అది కూడా నేనే చేశానంటాడు. అమరావతి నిర్మిస్తే అది కూడా నేనే అంటాడు. అభివృద్ధి పనులు పూర్తి చేసి మేం ఆనందిస్తుంటే.. గొడ్డలి పార్టీ అధ్యక్షుడు విధ్వంసం చేసేసి ఆరోపణలు చేస్తున్నాడు. ఎవరు ప్రజలకు ఇబ్బంది కలిగించినా వదిలి పెట్టేది లేదు." అని ముఖ్యమంత్రి అన్నారు. అనంతరం రైతులకు ట్రాక్టర్లను పంపిణీ చేశారు. వేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు కొలుసు పార్థసారథి, అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్, సీఎస్ సాయి ప్రసాద్, సీసీఎల్ఏ జయలక్ష్మి, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు.






# లండన్‌లో మంత్రి నారాయణ బృందం పర్యటన



**లండన్ :** అమరావతి ఐకానిక్ భవనాల డిజైన్లు రూపొందించిన ఫోస్టర్ అండ్ పార్టనర్స్ కార్యాలయానికి చేరుకున్న మంత్రి బృందం. ఫోస్టర్ అండ్ పార్టనర్స్, హఫీజ్ కాంట్రాక్టర్స్, ఎల్ అండ్ టీ ప్రతినిధులతో సమావేశమైన మంత్రి. ఐకానిక్ భవనాల నిర్మాణాలు జరుగుతున్న తీరుపై సమావేశంలో చర్చ. అసెంబ్లీ భవనం పైన నిర్మించే టవర్ నిర్మాణంపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చ. అత్యంత ఎత్తులో నిర్మించే టవర్‌ను అధునాతన టెక్నాలజీతో నిర్మించేలా డిజైన్ పై చర్చ. టవర్ నిర్మాణంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చిన ఎల్ అండ్ టీ సంస్థ. ఐకానిక్ భవనాల వెలుపలి డిజైన్లపైనా సమావేశంలో చర్చ. నిర్మాణ దశలను బట్టి డిజైన్ల విషయంలో ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్న నార్మన్ ఫోస్టర్స్ ప్రతినిధులు.

# దేశంలోనే తొలిసారిగా "తల్లీబిడ్డ" ఎక్స్‌ప్రెస్ వాహనాల్లో అత్యాధునిక భద్రతా సదుపాయాలు


## - సీఎం చంద్రబాబు ఆదేశాలతో 102 వాహనాల్లో ఎయిర్ బ్యాగులు, సీట్ బెల్టులు, ఫుట్‌రెస్టులు, ఇతర సౌకర్యాల కల్పన - తొలిదశలో 300 అధునాతన వాహనాల రెడీ - మిగిలిన 200 వాహనాలు త్వరలో సిద్ధం - మంగళవారంనాడు నరసరావుపేటలో మంత్రి సత్యకుమార్ యాదవ్‌చే ప్రారంభం

**అమరావతి, (రాజధాని వార్తలు):** తల్లీబిడ్డల సురక్షిత ప్రయాణానికి '102 'తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్' వాహనాల సేవలకు ప్రభుత్వం కొత్త రూపునిస్తోంది. దేశంలోనే తొలిసారిగా తల్లీ బిడ్డల భద్రత, ఆరోగ్య సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అత్యాధునిక వాహనాలను కూటమి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొస్తోంది. ముఖ్య మంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రూపురేఖలు, బ్రాండింగ్‌ను ఖరారు చేశారు. తల్లులు, నవజాత శిశువులు సులభంగా ఎక్కడం, దిగడం, ప్రయాణంలో భద్రత, అవసరమైన సౌకర్యాలను దృష్టిలో పెట్టుకుని వాహనాలు రూపొందిస్తున్నారు. ఆసుపత్రి నుంచి ఇంటికి వెళ్లే సమయంలో తల్లి, శిశువులకు ఎదురయ్యే రవాణా సమస్యను తొలగించడం, ప్రసవానంతర సంరక్షణను మెరుగు పరచడం, అధిక ప్రమాద (హైరిస్క్) గర్భిణులకు అవసరమైన సమయంలో రవాణా అందించడం ద్వారా మాతా, శిశు మరణాలను తగ్గించడమే ఈ సేవల ప్రధాన లక్ష్యం. కొత్త వాహనాల ప్రారంభ కార్యక్రమం ఆగస్టు 11న నరసరావుపేటలో జరగనుంది. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ నూతన వాహన సేవలను ప్రారంభించనున్నారు. రాష్ట్ర స్థాయిలో జరిగే ఈ కార్యక్రమానికి అనుగుణంగా జిల్లాల్లోనూ కొత్త వాహనాల సేవలు ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసావాలకు గర్భిణులకు మాత్రమే సేవలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయి. ఈ మేరకు రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ ఓ ప్రకటన నేడొక ప్రకటన జారీ చేశారు. మాతా శిశు మరణాలు తగ్గించేందుకు ఈ సేవలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.



**ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవిశీ చిన వారికి మాత్రమే ఉచిత వాహన సదుపాయం**

రాష్ట్రవ్యాప్తంగా '102 ' (తల్లీబిడ్డ ఎక్స్ ప్రెస్ వాహనాలు) సేవల్ని ఆధునిక విధానం మరింత విస్తరించేందుకు ప్రభుత్వం మొత్తం 500 వాహనాలను సమకూర్చుతోంది. తొలిదశలో 300 వాహనాలను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. మిగిలిన 200 వాహనాలను త్వరలో అందుబాటులోనికి రానున్నాయి. సదరు జిల్లాల్లో ప్రసవాల ఆధారంగా ఈ వాహనాలు కేటాయించారు. ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవించిన తల్లి, నవజాత శిశువును ఆసుపత్రి నుంచి ఇంటికి చేర్చే డ్రాప్‌బ్యాక్ సేవ పూర్తిగా ఉచితం. తల్లితోపాటు ఇద్దరు సహాయకులు కూడా ప్రయాణించవచ్చు. అధిక ప్రమాద గర్భిణులు, తీవ్ర రక్తహీనతతో రక్తమార్పిడి అవసరమైన గర్భిణులకు ప్రత్యేక పికప్, డ్రాప్‌బ్యాక్ సేవలు అందిస్తారు. 2025-26లో '102' సేవల ద్వారా 2,05,914 ప్రయాణాలు నిర్వహించారు. ఇందులో 1,65,093 ప్రసవానంతర డ్రాప్‌బ్యాక్ ప్రయాణాలు, 40,821 హైరిస్క్ గర్భిణుల రవాణా సేవలు ఉన్నాయి. వీటి నిర్వహణ బాధ్యతలను consortium of విద్యవేద ఫౌండేషన్ అండ్ మెసర్స్ శ్రీనివాస టూర్స్ అండ్ ట్రావెల్స్‌కు




తాజగా ప్రభుత్వం అప్పగించింది. ఈ సంస్థనే సొంత వాహనాలను నడుపుతోశీది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో '102' 'సేవల కోసం ప్రభుత్వం రూ.37.40 కోట్ల ప్రతిపాదిత బడ్జెట్‌ను కేటాయించింది.

**భద్రతకు అధునాతన ఫీచర్లు**

కొత్త వాహనాలు ఎయిర్ కండిషన్డ్ ఎస్‌యూవీ/ఎంయూవీ తరహాలో ఉంటాయి. గర్భిణులు, బాలింతలు సులభంగా ఎక్కేందుకు ప్రత్యేక ఫుట్‌రెస్టులు, లోపల పట్టుకునేందుకు హ్యాండ్‌రెయిల్స్ ఏర్పాటు చేశారు. దురదృష్టవశాత్తు జరిగే రోడ్డు ప్రమాదాల్లో రక్షణగా ఉండేశీదుకు వాహనాల పక్కల కలిపి ఆరు ఎయిర్ బ్యాగులు ఉన్నాయి. వెనుక సీట్లకు సీట్‌బెల్టులు , రివర్స్ పార్కింగ్ సెన్సార్లు, చైల్డ్ లాక్ స్లైడింగ్ డోర్లు, ఏబీఎస్, ఈబీడీ, ఈఎస్‌పీ, 80 కి.మీ. వేగం దాటితే హెచ్చరించే స్పీడ్ అలర్ట్, అగ్నిమాపక పరికరాలు ఉన్నాయి. వాహనాల్లో ఉష్ణోగ్రత నియంత్రణతో కూడిన ఏసీ ఉంటుంది. నవజాత శిశువుకు అనుకూలమైన ఉష్ణోగ్రత ఉండేలా దీనిని రూపొందించారు.


**అత్యవసరమైతే.. ఎస్ఓఎస్**

గర్భిణి కూర్చున్న సీటు వద్దే ఎమర్జెన్సీ ఎస్ఓఎస్ బటన్ ఏర్పాటు చేశారు. నొక్కగానే 102 కాల్‌సెంటర్‌కు సమాచారం చేరుతుంది. వాహనం ఉన్న ప్రదేశాన్ని లైవ్ జీపీఎస్ ద్వారా కంట్రోల్ సెంటర్‌కు పంపే వీలుంది. అవసరమైతే సమీప ఆరోగ్య కేంద్రాలతో సమన్వయం చేసి వైద్య సహాయం అందిస్తారు. వాహనాల్లో ఏఐఎస్-140 ప్రమాణాలకు అనుగుణమైన జీపీఎస్/వీఎల్‌టీడీ ట్రాకింగ్ వ్యవస్థ ఉంటుంది. జీపీఎస్‌తో పాటు భారత ఉపగ్రహ నావిగేషన్ వ్యవస్థ నావిక్ ద్వారా ద్వంద్వ ఉపగ్రహ కవరేజీ లభిస్తుంది. డ్యూయల్ సిమ్ 4జీ, నెట్‌వర్క్ లేని సమయంలో సమాచారాన్ని నిల్వ చేసే ఆఫ్‌లైన్ డేటా సదుపాయం, బ్యాకప్ బ్యాటరీ ఏర్పాటు చేశారు.

**ప్రయాణంలోనే ఆరోగ్య సూచనలు**

ప్రయాణంలో ఫోన్ ఛార్జ్ చేసుకునేందుకు మొబైల్ ఛార్జింగ్ పోర్టులు, హ్యాండ్ శానిటైజర్, టిష్యూ పేపర్, స్టెయిన్‌లెస్ స్టీల్ డస్ట్‌బిన్, ఫస్ట్‌ఎయిడ్ కిట్ అందుబాటులో ఉంచారు. ప్రత్యేక ఇంటిగ్రేటెడ్ ఆడియో వ్యవస్థ ద్వారా ప్రసవానంతర సంరక్షణ, నవజాత శిశు సంరక్షణ, తల్లిపాలు, శిశువుల పోషణ, టీకాలు, ప్రమాద సంకేతాలు, ఆరోగ్య జాగ్రత్తలపై ప్రభుత్వ సూచనలు వినిపిస్తాయి. డ్రైవర్ యాప్ మ్యాపింగ్, కాల్‌సెంటర్ అనుసంధానం, ఆర్‌సీహెచ్ ధ్రువీకరణలను ఐటీ వ్యవస్థలోకి తీసుకొచ్చారు. జీపీఎస్ ద్వారా వాహనం ఎక్కడ ఉందో తెలుసుకుని, అందుబాటులో ఉన్న వాహనాన్ని అవసరమైన చోటుకు కేటాయించడం, ప్రయాణాన్ని పర్యవేక్షించడం సులభమవుతుంది. రాష్ట్రంలోని ఏ ఫోన్ నుంచైనా టోల్‌ఫ్రీ 102ను సంప్రదించవచ్చు.

# ప్రభుత్వం హామీనీ అమలు చేసి సత్వర న్యాయం చేయండి: పిజిఆర్‌లో వేట్లపాలెం ఫైర్ యాక్సిడెంట్ బాధితురాలు



**కాకినాడ, (రాజధాని వార్తలు):** సామర్లకోట మండలం, వేట్లపాలెం గ్రామంలో ఫిబ్రవరి 28న జరిగిన బాణాసంచా పేలుడు సంఘటనలో మృతి చెందిన గోడత మహేష్ బాధిత కుటుంబానికి సత్వర న్యాయం చేయాలని కోరుతూ ఆయన భార్య గోడత శ్యామల కాకినాడ కలెక్టరేట్ ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక పిజిఆర్ఎస్‌ను ఆశ్రయించారు. ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు నష్టపరిహారం మాత్రమే చెల్లించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తాను ఎటువంటి ఆధారం లేకుండా ఉన్నానని, ప్రభుత్వం నివేశనా స్థలం ఇచ్చి ఇల్లు కట్టించి ఇస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చాలని జిల్లా కలెక్టర్‌కి వినతి పత్రం సమర్పించానన్నారు. బాణాసంచా ప్రమాదం జరిగి సుమారు 7నెలలు గడుస్తున్నా తమకు పూర్తి స్థాయిలో న్యాయం జరగలేదని వాపోయారు. తన కుమార్తె జీవనాధారం కోల్పోయి ఒంటరిగా జీవనం సాగిస్తోందని, వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న అధికారులు ఇప్పటికీ కనికరించలేదనీ బాధితురాలి తల్లి ఉండ్రాసు జీవరత్నం కన్నీటి పర్యంతమయ్యారు. కుటుంబ యజమానిని కోల్పోయి సొంత ఇల్లు సరైన జీవనోపాధి లేక పిల్లలతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తనకు ఇంటి స్థలం కేటాయించి, ఇల్లు కట్టించి ఇవ్వాలని, అలాగే వితంతు పింఛను ఏర్పాటు చేసి, ఉపాధి కల్పించాలని కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి న్యాయం చేసేల చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు.

# లండన్‌లో మంత్రి నారాయణ బృందం పర్యటన

## - అమరావతి ఐకానిక్ భవనాల తుది డిజైన్లపై ఫోస్టర్ అండ్ పార్ట్‌నర్స్, హాఫీజ్ కాంట్రాక్టర్స్, ఎల్ అండ్ టీ ప్రతినిధులతో చర్చ





**లండన్ :** అమరావతిలో నిర్మిస్తున్న ఐకానిక్ భవనాల తుది డిజైన్లపై చర్చించేందుకు రాష్ట్ర మంత్రి నారాయణ నేతృత్వంలోని అధికారుల బృందం లండన్‌లో పర్యటిస్తోంది. అధికారిక పర్యటనలో భాగంగా మంత్రి నారాయణ, అధికారులు రాత్రి లండన్ చేరుకున్నారు. లండన్ పర్యటనలో భాగంగా మంత్రి నారాయణ బృందం అమరావతి ఐకానిక్ భవనాల డిజైన్లు రూపొందించిన ఫోస్టర్ అండ్ పార్ట్‌నర్స్ కార్యాలయాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా ఫోస్టర్ అండ్ పార్ట్‌నర్స్, హాఫీజ్ కాంట్రాక్టర్స్, ఎల్ అండ్ టీ సంస్థల ప్రతినిధులతో మంత్రి సమావేశమయ్యారు. అమరావతిలో నిర్మిస్తున్న అసెంబ్లీ, హైకోర్టు, సెక్రటేరియట్ టవర్ల వెలుపలి డిజైన్లపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణ పనుల తీరుతో పాటు, భవిష్యత్తులో ఐకానిక్ భవనాల నిర్మాణ ప్రక్రియకు సంబంధించి ఆర్కిటెక్ట్‌లు, కన్సల్టెన్సీ, నిర్మాణ సంస్థల ప్రతినిధులతో మంత్రి నారాయణ చర్చించారు.

**అసెంబ్లీ భవనం పైభాగంలోని టవర్‌పై ప్రత్యేక చర్చ**

అమరావతి అసెంబ్లీ భవనం పైభాగంలో నిర్మించనున్న ఎత్తైన టవర్ డిజైన్‌పై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. అత్యంత ఎత్తులో నిర్మించనున్న ఈ టవర్‌ను అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించేలా డిజైన్ చేయడం, నిర్మాణ విధానాలకు సంబంధించిన అంశాలను సమావేశంలో పరిశీలించారు. అసెంబ్లీ భవనం పైన నిర్మించే ఈ టవర్ ద్వారా అమరావతి రాజధాని ప్రాంతాన్ని వీక్షించేలా టూరిస్ట్ ప్రాంతంగా రూపొందించే అంశంపై కూడా చర్చ జరిగింది.

**టవర్ నిర్మాణంపై ఎల్ అండ్ టీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్**

అసెంబ్లీ భవనం పైభాగంలో నిర్మించనున్న టవర్ నిర్మాణానికి సంబంధించి ఎల్ అండ్ టీ సంస్థ ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. టవర్ నిర్మాణానికి సంబంధించిన డిజైన్, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలను ప్రజెంటేషన్‌లో వివరించారు.

**ఐకానిక్ భవనాల ఫసాడ్ డిజైన్లపై చర్చ**

అసెంబ్లీ, హైకోర్టు, సెక్రటేరియట్ టవర్ల వెలుపలి డిజైన్లపై కూడా సమావేశంలో చర్చించారు. ప్రస్తుతం నిర్మాణాలు జరుగుతున్న తీరుకు అనుగుణంగా డిజైన్ల విషయంలో అవసరమైన సూచనలను ఎప్పటికప్పుడు చేయడం, నిర్మాణ దశలను బట్టి డిజైన్లకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై ఫోస్టర్ అండ్ పార్ట్‌నర్స్ ప్రతినిధులతో మంత్రి చర్చించారు. అమరావతి ఐకానిక్ భవనాల నిర్మాణాలు జరుగుతున్న తీరుపై సమావేశంలో సమీక్షించారు. ప్రస్తుతం చేపడుతున్న నిర్మాణ ప్రక్రియతో పాటు భవిష్యత్తులో చేపట్టాల్సిన నిర్మాణ దశలపై ఆర్కిటెక్ట్‌లు, కన్సల్టెన్సీ ప్రతినిధులతో మంత్రి నారాయణ చర్చించారు. మంత్రి నారాయణ వెంట సీఆర్డీయే కమిషనర్ విజయ రామరాజు, అడిషనల్ కమిషనర్ అభిషేక్ కుమార్, చీఫ్ ఇంజినీర్లు లండన్ పర్యటనలో పాల్గొన్నారు.

# పీ4 కార్యక్రమం కింద 100 గ్రామాల అభివృద్ధికి ఐటీసీ సహకారం




**(రాజధాని వార్తలు):** జీరో పావర్టీ పీ4 కార్యక్రమ లక్ష్యాలను మరింత ముందుకు తీసుకెళ్లే దిశగా స్వర్ణ ఆంధ్ర పీ4 ఫౌండేషన్, ఐటీసీ లిమిటెడ్ భాగస్వామ్యం కానున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధి అవకాశాల మెరుగుదల, బంగారు కుటుంబాల ఆర్థిక సాధికారత, సమగ్ర గ్రామీణాభివృద్ధికి తోడ్పడేలా ఈ భాగస్వామ్యం కొనసాగనుంది. ఈ భాగస్వామ్యంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని 9 జిల్లాల్లో 100 గ్రామాల అభివృద్ధికి ఐటీసీ లిమిటెడ్ సహకారం అందించనుంది. వీటిలో 15 గ్రామాలను పీ4 ఆదర్శ గ్రామాలుగా అభివృద్ధి చేసి, సమగ్ర గ్రామీణాభివృద్ధికి ఆదర్శ నమూనాలుగా తీర్చిదిద్దనున్నారు. స్వర్ణ ఆంధ్రఏ2047 లక్ష్యాలకు అనుగుణంగా రూపొందించే ఈ నమూనాలు రాష్ట్రంలోని ఇతర గ్రామాల్లోనూ అభివృద్ధి కార్యక్రమాలను విస్తరించేందుకు మార్గదర్శకంగా నిలవనున్నాయి. ఈ కార్యక్రమం ద్వారా బంగారు కుటుంబాలకు జీవనోపాధి, ఆదాయం, ఆర్థిక స్థిరత్వాన్ని మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో బంగారు కుటుంబాలను అనుసంధానం చేయడంతో పాటు వ్యవసాయం, నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారత, నీటి భద్రత, విద్య, వ్యర్థాల నిర్వహణ వంటి రంగాల్లో సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నారు. 15 పీ4 లైట్‌హౌస్ గ్రామాల్లో ఐటీసీ మిషన్ సునేహ్రా కల్ (బంగారు భవిష్యత్తు) కార్యక్రమం ద్వారా 10 సూత్రాల్లో 6 సూత్రాలను అమలు చేయనున్నారు. కార్యక్రమాల సమర్థవంతమైన అమలుకు అవసరమైన సాంకేతిక సహాయం, శిక్షణ, అమలు విధానాలు, క్షేత్రస్థాయి నైపుణ్యాన్ని ఐటీసీ అందించనుంది. స్వర్ణ ఆంధ్ర పీ4 ఫౌండేషన్ వైస్ చైర్మన్ చెరుకూరి కుటుంబరావు మాట్లాడుతూ, ఐటీసీ లిమిటెడ్‌తో భాగస్వామ్యం ద్వారా 100 గ్రామాల్లో సమగ్ర అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు. బంగారు కుటుంబాలకు జీవనోపాధి, ఆర్థిక స్థిరత్వాన్ని బలోపేతం చేయడంలో ఈ భాగస్వామ్యం కీలకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. స్వర్ణ ఆంధ్ర పీ4 ఫౌండేషన్ సీఈఓ శ్రీ అనంత్ శంకర్ మాట్లాడుతూ, 15 పీ4 లైట్‌హౌస్ గ్రామాలను ఆదర్శ గ్రామీణాభివృద్ధి నమూనాలుగా తీర్చిదిద్దడం ద్వారా కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. ఐటీసీ సాంకేతిక నైపుణ్యం, క్షేత్రస్థాయి అనుభవం పీ4 కార్యక్రమం అమలును మరింత బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. ప్రతిపాదిత అవగాహన ఒప్పందం మూడు సంవత్సరాల కాలపరిమితితో ఆర్థికేతర ఒప్పందంగా అమలు కానుంది. ప్రతి సంస్థ తన బాధ్యతలకు సంబంధించిన వ్యయాలను తానే భరించనుంది. కార్యక్రమం అమలు, పర్యవేక్షణ కోసం ఎస్‌ఏపిఎఫ్, ఐటీసీ ప్రతినిధులతో ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో స్వర్ణ ఆంధ్ర పీ4 ఫౌండేషన్ వైస్ చైర్మన్ చెరుకూరి కుటుంబరావు సీఈఓ అనంత్ శంకర్ డైరెక్టర్ వి.సాంబశివరాజు, ఐటీసీ లిమిటెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ రాహుల్ గౌరహా సౌత్ రీజినల్ మేనేజర్ బినోయ్, దినేష్ హుండేకర్ దేబస్మిత్ చక్రవర్తి పాల్గొన్నారు.

# డొంక రహదారుల ప్రతిపాదనలు శత శాతం రావాలి



**గుంటూరు, (రాజధాని వార్తలు):** డొంక రహదారుల ప్రతిపాదనలు శత శాతం రావాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ ఆదేశించారు. పంట పొలాలకు వెళ్ళుటకు డొంక రహదారులు ఉపయోగపడతాయని అన్నారు. వివిధ అంశాలపై జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులు, మండల అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విబి జి రామ్ జి పనులలో వేతనదారులు ఎక్కువ సంఖ్యలో పాల్గొనాలన్నారు. పంట బీమా శత శాతం చేయాలని ఆదేశించారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమానికి అర్హత సాధించుటకు రైతుల నమోదు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్ (పి.పి.పి) లో ప్రజల సానుకూల స్పందన పెరగాలని, అందుకు తగిన విధంగా నాణ్యమైన సేవలు అందించాలని ఆదేశించారు.

**11 నుండి ఆధార్ ప్రత్యేక శిబిరాలు**

జిల్లాలో ఆధార్ ప్రత్యేక శిబిరాలు ఈ నెల 11వ తేదీ నుంచి పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చెప్పారు. 11 నుంచి 14వ తేదీ వరకు మరియు 17 నుండి 20వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. బయో మెట్రిక్ అప్డేషన్ పెండింగ్‌ను ఇందులో ప్రధానంగా చేపట్టడం జరుగుతుందని అన్నారు. 64,067 కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు గణాంకాలు ఉన్నాయని తెలిపారు. ప్రధాన ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్‌లు ఇందులో శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, ముఖ్య ప్రణాళిక అధికారి పి.శేషశ్రీ, జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ, మున్సిపల్ కమిషనర్‌లు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## లిఖిత రూపాల నిరంకుశత్వం

మన దేశంలో - సహజంగానే - కులవ్యవస్థ వ్యాప్తికీ, కొనసాగింపుకీ లిఖిత సంప్రదాయం ఉపకరించింది. 'విధిరాత'కి సర్వత్రా విధేయత లభించింది. అర్థం కానిదల్లా 'బ్రహ్మలిపి' అయింది. అయితే ఇది కొద్ది రోజుల్లో కొంతమంది ఒక చోట గుమిగూడి చేసిన కుట్ర కాదు; శతాబ్దాలపాటు క్రమేపీ దేశమంతటా వ్యాపించిన భావజాలం. మాట్లాడే జంతువు మనిషి మాత్రమే. సుమారు లక్ష సంవత్సరాల క్రిందట భాషకు మౌలిక రూపాలు ఏర్పడ్డాయని శాస్త్రజ్ఞుల అంచనా. ఆదిమ మానవులు గుంపులుగా వేటాడేటప్పుడు, ఒకరినొకరు హెచ్చరించుకుంటూ, జంతువు జాడను తెలియపరచుకుంటూ ముందుకి సాగిన కాలంలో శబ్దాలు, అనుకరణలు, మాటలు అవసరమయ్యాయి. వేట ముగిసాక, రాత్రిపూట మంట చుట్టూ చేరి, మాంసం తింటూ, ఆ రోజున జరిగిన సాహసాల్ని పిల్లలకు వివరించినప్పుడు కథలు పుట్టి ఉండవచ్చు. మాటలు, పాటలయ్యాయి; పాటకి నృత్యం తోడైంది. సాహిత్యం, సంగీతం, భాషతోనే వికసించాయి. భాష అనే ఉమ్మడి సాధనమే మానవ సమూహాల తొలి అస్తిత్వ ప్రకటన. లిపి తరవాతెప్పుడో (సుమారు క్రీపూ. 3000) పుట్టింది. తిండిని పోగు చేసుకుంటూనో, వేటాడుతూనో, లేదా పశుపోషకులుగానో జీవించిన తెగలకు లిపి అవసరం లేదు. నదీ తీరాలలో స్థిర వ్యవసాయం మొదలై, పట్టణాలు వెల్లివిరిసాక - నాగరికులకు ఎన్నో వస్తువులు, దినుసులు, వస్త్రాలు, మద్యం, వగైరాలు అవసరమ య్యాయి. అదనపు ఫలసాయం, వస్తు మార్పిడి, ఇతర ప్రాంతాలలో దొరికే వస్తువులను సంపాదించుకోవడానికి తోడ్పడ్డాయి. డబ్బు వాడుకలోకి వచ్చాక, దూర దేశాలతో వ్యాపారం సుగమం అయింది. నౌకా రవాణా వృద్ధి చెంది, రేవులు నగరాలయ్యాయి. ఈ క్రమంలోనే లిపి అవసరమైంది. సింధు నదీ ప్రాంతంతో సహా అన్ని ప్రాచీన నాగరికతలలోనూ వర్తకుల ముద్రలకు, సుంకాల పట్టీలకు, పాలకుల ప్రకటనలకు లిపి ఆధారమైంది. శిలాక్షర రూపాల్లో శాసనాలు లిఖించబడ్డాయి. తర్వాతి దశలో అంతవరకూ మౌఖికంగా ఉండిన జానపద గాథలకు లిఖిత రూపం ఇచ్చే ప్రయత్నం జరిగింది. ఆ రాతలు చిలవలు పలవలుగా విస్తరించాయి. ఒకే మూలకథ వివిధ ప్రాంతాల్లో, కాలాల్లో లిఖిత రూపాల్లోకి రూపాంతరం పొందింది. ఈ ప్రక్రియ, పండితుల పూనికతో, పాలకుల ఆధ్వర్యంలో జరిగింది. మౌఖిక రూపాలకు ఉండే స్థానికత, భిన్నత్వం, స్థలకాల విశేషాలకు అనుగుణంగా మలుచుకొనే ఒదుగుబాటు- లిఖిత రూపాలకు లోపిస్తుంది. అవి శాశ్వత శాసనాలుగా, మార్చలేని బోధనలుగా తొందరలోనే అవతరిస్తాయి. దీన్నే ఆధునిక భాషా శాస్త్రానికి ఆద్యుడైన స్విస్ భాషాశాస్త్రవేత్త ఫెర్డినాండ్ డి సాసూర్ (1857-1913) 'లిఖిత రూపాల నిరంకుశత్వం' అన్నాడు. అతడి ప్రతిపాదనలను మన దేశానికి, మన ప్రాంతాలకు అన్వయించే ప్రయత్నం ఈ వ్యాసం. పురాణాలు, ధర్మ సూత్రాలు, ముఖ్యంగా పవిత్ర గ్రంథాలు వెలువడ్డానికి లేఖనం గొప్ప వెసులుబాటుని కల్పించింది. స్థానిక విశ్వాసాల సముదాయాలు మతరూపంలో వ్యవస్థీకృతం అయ్యాయి. మనదేశంలో మాత్రం ఒక వైపు తెగల విశ్వాసాలు, మరో వైపు వ్యవస్థీకృత మతం చెట్టాపట్టాలు వేసుకుంటూ కొనసాగుతున్నాయి. చరిత్రకారుడు డి.డి. కోసంబి (1907-1966) చెప్పినట్లు - కొత్తగా ప్రవేశించిన ఏ వ్యవస్థయినా పాత వ్యవస్థను పూర్తిగా తొలగించలేకపోవడం, అన్ని పురాతన పద్ధతులూ, లోలోపలి పొరలుగా కొనసాగడం, మన దేశపు ప్రత్యేకత. ఇందుకు మరో ఉదాహరణ- వేల ఏళ్లపాటు కొనసాగిన వేదాల మౌఖిక రూపం. ఒక్క అక్షరం కూడా పొల్లు పోకుండా, ఉచ్చారణలో మార్పులు లేకుండా, ఈ పరంపర కొనసాగడం గొప్ప విశేషం. పవిత్ర బోధనలను ముఖస్థం చేయడమే సరైన పద్ధతి అని పూర్వీకుల భావన కావచ్చు; లేదా లిఖిత రూపంలో ఉంటే అవి ఎవరి చేతిలోకి వెళ్లి మైల పడతాయో అనే భయం కావచ్చు. నిష్ఠాపరులైన బ్రాహ్మణులకు తప్ప వేరెవరికీ అందుబాటులో లేని వేదాలను మినహాయిస్తే, పంచమ వేదమైన మహాభారతాన్నీ, అలాగే రామాయణ భాగవతాలనూ, పామరులకు విడమర్చి చెప్పేందుకై పండితులు అవసరం. ప్రవచనకారుల దృష్టి కథా, కథానాలకన్నా సామాన్య జనులు గ్రహించాల్సిన ధర్మ సూక్ష్మాలపైనే ఎక్కువగా ఉంటుంది. అన్ని వ్యవస్థీకృత మతాలలోనూ, పవిత్ర గ్రంథాల్లోని ఒక్క అక్షరాన్ని కూడా మార్చకూడదని సంప్రదాయవాదులు పట్టుబడతారు. ఆ విధంగా శాశ్వత ప్రాతిపదికపై సమాజాన్ని కట్టడి చేయగల సాధనాలను పాలకులు సమకూర్చుకున్నారు. ముద్రణాయంత్రం లిఖిత సంప్రదాయ సుస్థిరతకి, వ్యవస్థీకృత మతాల వ్యాప్తికి, విశేషంగా తోడ్పడింది. మన దేశంలో - సహజంగానే - కులవ్యవస్థ వ్యాప్తికీ, కొనసాగింపుకీ లిఖిత సంప్రదాయం ఉపకరించింది. 'విధిరాత'కి సర్వత్రా విధేయత లభించింది. అర్థం కానిదల్లా 'బ్రహ్మలిపి' అయింది. అయితే ఇది కొద్దిరోజుల్లో కొంతమంది ఒక చోట గుమిగూడి చేసిన కుట్ర కాదు; శతాబ్దాలపాటు క్రమేపీ దేశమంతటా వ్యాపించిన భావజాలం. పాలకుల ఉనికిని కాపాడుకోవడానికీ, ప్రజల్ని నియంత్రించేం దుకూ అత్యంత సామర్థ్యవంతమైన ఆలోచనా చట్రమే పాలకవర్గ భావజాలంగా పరిణమిస్తుంది. మౌఖిక భాషాభివృద్ధి దిగువనుండి, లిఖిత రూపం ఎగువ నుండి తమ ప్రయాణాలను ఆరంభించాయి. ఈ క్రమంలో కులవ్యవస్థ కీలకమైన పాత్రను పోషించింది. నిజానికి భారత దేశంలో ప్రాచీన కాలంలోనైనా, ఆధునిక యుగంలోనైనా ఏ ఒక్క అభివృద్ధి ప్రక్రియ లేదా మార్పు కూడా కులవ్యవస్థకి బాహ్యంగా జరగలేదు. సామాజిక చలనం తీవ్రతరమైన సందర్భాలలో కూడా కులం బలహీన పడలేదు సరి కదా, కొత్త నిర్మాణాల్లోనూ విడదీయలేని భాగం అవుతూ వచ్చింది.

# "ఎల్ నినో" దృష్ట్యా సాగు జాగ్రత్తలు ఉండాలి

## - రైతులకు ఎమ్మెల్యే, శాస్త్రవేత్తలు సూచన



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాలు తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు వరి సాగులో జాగ్రత్తలు పాటించాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప, వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. సామర్లకోట మండలం ఉండూరు గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో శనివారం "రైతన్న మీకోసం" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దాపురం నియోజకవర్గ శాసన సభ్యులు నిమ్మకాయల చినరాజప్ప ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆచార్య ఎన్జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ "ఎల్‌నినో" ప్రభావం కారణంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్వల్పకాలిక వరి రకాలను సాగు చేసుకోవడంతో పాటు నీటిని పొదు పుగా వినియోగించాలని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో కలుపు, చౌడు సమస్యలు అధికమయ్యే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి జీవ ఎరువులు, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాలని, వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించిన సలహాలను పాటించాలని రైతులకు తెలిపారు. బోర్ల కింద, మెరక భూముల్లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటలను సాగు చేయాలని ఆయన సూచించారు. వరి సాగులో రైతులకు ఉన్న సందేహాలను కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు. ఆచార్య ఎన్జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ డా.పి మునిరత్నం మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం కారణంగా తక్కువ వర్షపాతం, కొన్ని సందర్భాల్లో అధిక వర్షాలు సంభవించే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఆరు వ్యవసాయ ప్రాంతాలకు శాస్త్రవేత్తలను కేటాయించినట్లు తెలిపారు. గోదావరి డెల్టా ప్రాంతంలోని మండలాల్లో శాస్త్రవేత్తలు పర్యటిస్తూ, ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంటల యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. డా.సి.హెచ్. శ్రీనివాస్, పరిశోధన సహ సంచాలకులు, మారుటేరు మాట్లాడుతూ రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద వరి పంటకు ఎకరాకు రూ. 760 చొప్పున ప్రీమియం చెల్లించి పంట బీమా చేసుకోవాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయే పరిస్థితుల్లో పంట బీమా రైతులకు రక్షణగా ఉంటుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం డీపీఎం ఏలియాజర్ ప్రకృతి వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంలో నీమాస్త్రం తయారీ విధానం, విత్తన గుళికల తయారీ విధానం తదితర అంశాలను రైతులకు వివరించారు. ఉండూరు గ్రామంలో రైతులు, శాస్త్రవేత్తలు మరియు వ్యవసాయ అధికారులు కలిసి కొన్ని వ్యవసాయ భూకమతములను సందర్శించారు. ఈ కార్యక్రమంలో డా.భవాని ప్రసాద్, డా.సీతారామ శర్మ, సమన్వయకర్త, ఏరువాక కేంద్రం, డా.రామభద్ర రాజు, డా. విశాలాక్షి, డా. సునీత, డా.సుజాత, వ్యవసాయ సహాయ సంచాలకులు కే దుర్గాలక్ష్మి, మండల వ్యవసాయ అధికారి, వంగపండు మురళీధర్, ఏఈవోలు, విఎఎలు, సామర్లకోట మండల తెదేపా అధ్యక్షులు మునిరెడ్డి శ్రీరాములు, సామర్లకోట రైతు సంఘం అధ్యక్షులు కంటే జగదీశ్ మోహన్ (బాబు), నీటి సంఘం అధ్యక్షులు కొప్పిరెడ్డి వీరస్వామి, బచ్చుల వీర వెంకటరమణ, పేపకాయల సుబ్బారావు, సలాది తాతాజీ తదితర కూటమి నాయకులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# అస్వస్థతకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే సామర్లకోట పట్టణ ప్రజలకు కుళాయి ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతోందని, ఫలితంగా పలువురు చిన్నారులు అనారోగ్యానికి గురై ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని పెద్దాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దవులూరి దొరబాబు ఆరోపించారు. చిన్నారుల అనారోగ్యానికి కారణ మైన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా వాటర్ విభాగానికి చెందిన బాధ్యులను సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రిలో అనారోగ్యాలతో చికిత్స పొందుతున్న చిన్నారులను, వారి తల్లిదండ్రులను దవులూరి దొరబాబు పరామర్శించారు. వారికి అందుతున్న వైద్య సేవలపై ఆసుపత్రి సూపరింటెండెంట్ కార్తీక్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లా డుతూ పట్టణంలోని వివిధ ప్రాంతాలకు చెందిన చిన్నారులు గత వారం రోజులుగా అనారోగ్యానికి గురై ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని తెలిపారు. తాగునీరు కలుషితమవుతున్న విషయంపై గత రెండు నెలలుగా మానవ హక్కుల సంఘం, వైఎస్సార్‌సీపీ నాయకులు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. జూన్ 19న సైతం తాగునీటి సమస్యపై అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకపోవడం వల్లే ప్రస్తుత పరిస్థితి ఏర్పడిందని జిల్లా మానవ హక్కుల సంఘం నాయకులు నూతలపాటి అప్పలకొండ పేర్కొన్నారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను పరామర్శించి అధికారులను ప్రశ్నించడంతోనే సమస్య వెలుగులోకి వచ్చిందని దొరబాబు అన్నారు. ఇటీవల వాటర్ పంప్‌హౌస్



వద్ద జనరేటర్‌కు డీజిల్ లేకపోవడంతో పట్టణానికి తాగునీటి సరఫరా నిలిచిపోయిందని తెలిపారు. వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెబుతున్న ప్రభుత్వం వద్ద తాగునీటి పంపింగ్‌కు అవసరమైన డీజిల్‌కు కూడా డబ్బులు లేని పరిస్థితి నెలకొందని విమర్శించారు. పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించే వరకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని, ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో తక్షణమే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని దొరబాబు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఊబా జాన్ మోజెస్, ఆవాల లక్ష్మీనారాయణ, మన్యం చంద్రరావు, కరణం రాజ్‌కుమార్, పాగా సురేష్‌కుమార్, ఇరుసుమళ్ల సాయి, లింగం శివప్రసాద్, పాలికి చంటిబాబు, చిట్టిమాని శ్రీనివాస్, రెడ్డి వాసు, దూది రాజు తదితరులు పాల్గొన్నారు.

# సరసమైన ధరలకు నాణ్యమైన బియ్యం

## - జిల్లాలో 22 ప్రత్యేక రైస్ కౌంటర్లు ఏర్పాటు





**అమలాపురం, (రాజధాని వార్తలు):** ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని సరసమైన ధరలకు అందించడంతో పాటు బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలను నియంత్రించే లక్ష్యంతో జిల్లాలో ఆగస్టు 3వ తేదీ నుంచి మార్కెట్ ఇంటర్వెన్షన్ ప్రోగ్రాం (ఎంఐపి) అమలు చేస్తున్నట్లు డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ వి.ఖోమ్. నైడియాదేవి తెలిపారు. జిల్లాలోని 19 మండలాల తహసీల్దార్ కార్యాలయాలతో పాటు అమలాపురం, కొత్తపేట, రావులపాలెం రైతు బజార్లలో మొత్తం 22 ప్రత్యేక రైస్ కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. ప్రభుత్వ నిర్ణయించిన ధరలకు నాణ్యమైన బియ్యాన్ని ఈ కౌంటర్ల వద్ద విక్రయించనున్నారు.

ధరలు:

స్టీమ్ రైస్ (బిపిటి) – కిలో రూ.52

రా రైస్ (బిపిటి) – కిలో రూ.50

బియ్యం కొనుగోలు చేసే సమయంలో వినియోగదారులు ఆధార్ కార్డు, రైస్ కార్డు, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్ వెంట తీసుకు వెళ్లాలన్నారు. ఒక్క రైస్ కార్డుకు 5 లేదా 10 కిలోలు, నెలకు గరిష్ఠంగా 10 కిలోల వరకు బియ్యం అందజేస్తారని జెసి తెలిపారు. విక్రయ కేంద్రాల్లో తగినంత నిల్వలు, ధరల ప్రదర్శన, సరైన తూనికలు, నిరంతర సరఫరా, మర్యాద పూర్వక సేవలు తప్పనిసరిగా ఉండాలని జాయింట్ కలెక్టర్ సూచించారు.

అధిక ధరలకు విక్రయించడం, నాసిరకం బియ్యం సరఫరా చేయడం లేదా ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించడం వంటి చర్యలను సహించబోమని హెచ్చరించారు. కార్యక్రమం అమలును తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్ (సివిల్ సప్లైస్) అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ధరలు, నాణ్యత, నిల్వలు, విక్రయాలపై తనిఖీలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి పి. విజయ భాస్కర్ పాల్గొన్నారు. ప్రజలు ఈ అవకా శాన్ని సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ కోరారు.

# అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి మానవతా సాయం



**అల్లవరం, (రాజధాని వార్తలు):** అల్లవరం మండలం యెంట్రుకోనలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుం బానికి ఇరు చారిటబుల్ ట్రస్టులు మానవతా సహాయం అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నాయి. అగ్ని ప్రమాదంలో ఇల్లు పూర్తిగా దగ్ధమై నగదు, గృహోపకరణాలతో పాటు సర్వం కోల్పోయి నిరా శ్రయులైన తిక్కిరెడ్డి లక్ష్మి కుటుంబానికి మానవతా దృక్పథంతో రుద్రరాజు సీతాపతిరాజు మెమోరియల్ ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ గోడిలంక, మోసుగంటి గంగయ్య మెమోరియల్ ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్, కొమరగిరిపట్నం వారి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం బాధిత కుటుంబానికి 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు, దుస్తులు, నగదు సహాయం అందజేశారు. గ్రామ మాజీ సర్పంచ్ తిక్కిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ అగ్నిప్రమాదంతో సర్వస్వం కోల్పోయిన కుటుంబానికి అండగా నిలిచి ఆపద సమయంలో మానవతా దృక్పథంతో సహాయం అందించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని శ్రీనివాస్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇరు ట్రస్టు అధ్యక్షులు రుద్రరాజు రమేష్ రాజు, మోసుగంటి వెంకటేశ్వరరావు, వాసర్ల సత్యనారాయణ, వర్రే సూరిబాబు, తిక్కిరెడ్డి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

# మూడవ రోజు కొనసాగుతున్న వైఎస్ఆర్సిపి రిలే నిరాహార దీక్ష



**అమలాపురం, (రాజధాని వార్తలు):** ఏపీ 2025 డీఎస్సీ నియామకాలలో కూటమి ప్రభుత్వం చేసిన అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించి, బాధ్యుడైన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని, యువతకు నిరుద్యోగ భృతి, ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే రిలీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన రిలే నిరాహార దీక్ష శనివారం మూడవ రోజుకు చేరుకుంది. వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ గౌరవాధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, అమలాపురం అసెంబ్లీ ఇన్‌చార్జ్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ అధ్యక్షతన అమలాపురం హై స్కూల్ సెంటర్లో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. విద్యార్థులు, యువతను నమ్మించి మోసం చేస్తూ వారి భవిష్యత్తుతో రాజకీయం చేయడం ఎంతమాత్రం సమంజసం కాదని శ్రీకాంత్ తీవ్రంగా మండిపడ్డారు. దేశంలో 'నీట్' పేపర్ లీకేజ్ వివాదంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ, ఇక్కడ కూడా కూటమి ప్రభుత్వం చేసిన మోసంపై సీబీఐ విచారణ జరిపించి, బాధ్యుడైన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేరే వరకు పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయేల్, అమలాపురం మాజీ ఎంపీ చింతా అనురాధ, అమలాపురం పరిశీలకులు కటకంశెట్టి ఆదిత్య, మండలాల అధ్యక్షులు కొనుకు బాపూజీ, గుత్తుల చిరంజీవి, ఎంపీపీ ఇళ్ల శేషారావు, పట్టణ అధ్యక్షులు సంసాని నాని, రాష్ట్ర కార్యదర్శులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, వంటెద్దు వెంకన్నాయుడు, ఎస్ఇసి మెంబర్ కూడిపూడి భరత్, విద్యార్థి విభాగ రీజనల్ కో ఆర్డినేటర్ రమేష్, జిల్లా యువజన విభాగ అధ్యక్షులు శిరీష్, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు సత్యమోహన్, జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షులు ములపర్తి శ్రీను, జడ్పీటీసీలు పందిరి శ్రీహరి, కొనుకు గౌతమి, ఆర్.టి.ఐ విభాగ జోన్ 2 అధ్యక్షులు వర్మ, మండల యువజన విభాగ అధ్యక్షులు కేత భానుతేజ, ఇళ్ల గోపి, సరేళ్ళ రామకృష్ణ, తిక్క ప్రసాద్, సుధ గణపతి, జానా గణేష్, బోస్, పొలమూరి బాలకృష్ణ, దంగేటి రుద్ర, చింతా రామకృష్ణ, పల్లి జేమ్స్, కరెళ్ళ రమేష్, స్పర్జన్, మాజీ సర్పంచ్లు, గ్రామ కమిటీ అధ్యక్షులు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం దీక్షలో పాల్గొన్న అమలాపురం అసెంబ్లీ ఇంచార్జ శ్రీకాంత్, సభ్యులకు ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపచేశారు.

# పలు కుటుంబాలకు సీఎం రిలీఫ్ పంపిణీ

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం మండలం చంద్రమాంపల్లి తాటిపర్తి, తిరుపతి, వడ్లమూరు, రాగంపేట గ్రామాలలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు రంగనాగ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నూనె రామారావు, మొయిళ్ళ కృష్ణమూర్తి, రేలంగి బుజ్జి, కంటిబోయిన వెంకటేశ్వ రరావు, కొమిరెడ్డి బుజ్జి, రేలంగి వెంకట్రావు, దేవళ్ల సతీష్, ఏసుబాబు, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా దద్దరిల్లేలా ప్లాన్...టాక్సిక్ మెగా రిలీజ్!



రాకింగ్ స్టార్ యశ్ నటించిన 'కేజీఎఫ్' ఊచకోత తర్వాత వస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'టాక్సిక్'. ఈ సినిమా కోసం భారతీయ సినీ ప్రేక్షకులు మాత్రమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ చిత్రం అమెరికాలో మైండ్ బ్లాకయ్యే రేంజ్‌లో భారీ విడుదలకు సిద్ధమవుతోంది. అక్కడ ఏకంగా 2000 పైచిలుకు స్క్రీన్లలో ఈ సినిమాను రిలీజ్ చేసేందుకు మేకర్స్ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక దీంతో ఓవర్సీస్‌లో ఇండియన్ సినిమా చరిత్రలోనే ఇది ఒక సరికొత్త రికార్డుగా నిలవబోతోంది.

**యశ్ రాకతో అమెరికాలో దద్దరిల్లుతున్న బజ్ :**

గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ మూవీ అమెరికా థియేటర్లలో సరికొత్త హంగామా సృష్టించబోతోంది. అక్కడి అగ్ర పంపిణీదారులు ఒక భారతీయ సినిమాకు ఈ స్థాయిలో 2,000 కంటే ఎక్కువ స్క్రీన్లు కేటాయించడం చాలా అరుదు. ఇక రాకింగ్ స్టార్ యశ్ కు ఉన్న గ్లోబల్ మేనియాని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆగస్టు 26న విడుదల కానున్న ఈ సినిమా అమెరికా ప్రీమియర్స్ కలెక్షన్లలో పాత రికార్డులన్నింటినీ తుడిచి పెట్టేలా కనిపిస్తోంది.

**ఆరు భాషల్లో గ్యాంగ్‌స్టర్ ఊచకోత:**

'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' చిత్రాన్ని కేవలం భారతీయ భాషల్లోనే కాకుండా ఇంగ్లీష్‌తో సహా మొత్తం ఆరు భాషల్లో ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. ఇక కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ భారీ గ్యాంగ్‌స్టర్ థ్రిల్లర్‌లో యష్ నటుడిగానే కాకుండా సహ నిర్మాతగా కూడా వ్యవహరిస్తున్నారు. అధికారం, ద్రోహం, ప్రతీకారం చుట్టూ తిరిగే కథతో వస్తున్న ఈ సినిమా ట్రైలర్ ఇప్పటికే నెట్టింట ట్రెండ్ అవుతూ సినిమాపై అంచనాలను ఆకాశానికి ఎత్తేసింది.

**విపరీతమైన తారల బలగంతో బిగ్ సర్ప్రైజ్:**

ఈ సినిమాలో యశ్ సరసన నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, హుమా ఖురేషి, రుక్మిణి వసంత్ వంటి అగ్ర నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ప్రతీ పాత్రకూ ఒక ప్రత్యేకమైన షేడ్ ఉండటం ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామాకు ప్రధాన బలంగా మారనుంది. ఇక ముఖ్యంగా తండ్రీకొడుకుల మధ్య సాగే భావోద్వేగపూరిత సంఘర్షణ ప్రేక్షకులకు సరికొత్త థ్రిల్‌ను అందిస్తుందని చిత్ర బృందం చెబుతోంది. మొత్తానికి రాకింగ్ స్టార్ యష్ 'టాక్సిక్' సినిమాతో బాక్సాఫీస్ వద్ద మరోసారి సరికొత్త చరిత్ర సృష్టించడానికి రెడీ అయిపోయారు. అమెరికాలో 2000కి పైగా స్క్రీన్లలో విడుదలవుతున్న ఈ చిత్రం ఎలాంటి రికార్డులను తిరగరాస్తుందో చూడాలి. ఇక ఆగస్టు 26న థియేటర్లలోకి రానున్న ఈ గ్యాంగ్‌స్టర్ అడ్వెంచర్ వేట కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

# అట్లీ చుట్టూ బాలీవుడ్..అసలేం జరుగుతోంది?



సౌత్ నుంచి వెళ్లి నార్త్ బాక్సాఫీస్ వద్ద సంచలనాలు సృష్టించడం ఇప్పుడున్న ట్రెండ్‌లో సాధారణ విషయమే అయినా అక్కడ సుస్థిరమైన స్థానాన్ని ఏర్పరచుకోవడం మాత్రం అందరికీ సాధ్యం కాదు. ఈ జాబితాలో సంచలన దర్శకుడు అట్లీ తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారు. బాద్‌షా షారుఖ్ ఖాన్‌తో కలిసి తెరకెక్కించిన జవాన్ చిత్రంతో బాలీవుడ్‌లో ఎలాంటి చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేశారో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఈ ఒక్క చిత్రంతోనే అట్లీ రేంజ్ జాతీయ స్థాయికి చేరింది. ఇండస్ట్రీ మొత్తం ఆయన వైపు ఆశ్చర్యంగా చూసేలా చేసింది. ప్రస్తుతం అట్లీ టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌తో కలిసి రాకా అనే భారీ పాన్-ఇండియా సినిమాను తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. భారీ బడ్జెట్‌తో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఒకవేళ ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద అనుకున్న విధంగా ఘన విజయం సాధిస్తే అట్లీ రేంజ్ ఊహకందనంత స్థాయికి దూసుకుపోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ క్రేజ్‌ను ముందే గ్రహించిన బాలీవుడ్ ప్రముఖులు అప్రమత్తమై అట్లీతో సినిమా చేయడానికి ఇప్పటి నుంచే ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే బాలీవుడ్ మిస్టర్ పర్‌ఫెక్షనిస్ట్ అమీర్‌ఖాన్ ఇప్పటికే అట్లీతో టచ్‌లోకి వెళ్లారనే వార్తలు ఇండస్ట్రీలో జోరుగా చక్కర్లు కొడుతున్నాయి. వీరిద్దరి కలయికలో ఓ ఆసక్తికరమైన స్టోరీ లైన్ కూడా లాక్ అయినట్లు సమాచారం. అయితే కథకు సంబంధించిన ఫైనల్ వెర్షన్ తయారై పూర్తి స్థాయి రూపం సంతరించుకోవడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉంది. అందుకు ఎలా లేదన్నా ఏడాదిన్నర సమయం పడుతుంది. మరోవైపు అట్లీతో ప్రాజెక్ట్ చేసేందుకు బాలీవుడ్‌లోని మరికొందరు స్టార్ హీరోలు కూడా రేసులో వచ్చి చేరుతుండటం విశేషం. ఒక వైపు సౌత్ స్టార్లతో సినిమాలు చేస్తూనే.. మరోవైపు బాలీవుడ్ టాప్ హీరోల నుంచి వరుస ఆఫర్లను దక్కించుకోవడం అట్లీ మేకింగ్ స్టైల్‌కు దక్కిన అతి పెద్ద గుర్తింపుగా చెప్పొచ్చు. కమర్షియల్ హంగులతో పాటు ప్రేక్షకులకు కావాల్సిన విజువల్ ట్రీట్‌ను ఇవ్వడంలో అట్లీ చూపించే ప్రతిభే హిందీ చిత్ర పరిశ్రమను ఆయన వైపు ఆకర్షిస్తోంది. ఒక్క విజయంతో ఆగిపోకుండా తదుపరి అడుగులను ఎంతో వ్యూహాత్మకంగా వేస్తూ అట్లీ తనకంటూ బలమైన బ్రాండ్‌ను క్రియేట్ చేసుకుంటున్నారు. భారతీయ చలనచిత్ర పరిశ్రమలో ఇప్పుడున్న మోస్ట్ వాంటెడ్ దర్శకులలో అట్లీ ముందు వరుసలో ఉన్నారు. నిర్మాతలు, హీరోలు కోట్లు పెట్టుబడి పెట్టడానికి ముందుకు వస్తున్నారంటే అది అట్లీ బాక్సాఫీస్ స్టామినాపై ఉన్న నమ్మకమే. అట్లీ సినిమాల జోరు చూస్తుంటే టాలీవుడ్, బాలీవుడ్ అనే సరిహద్దులను చెరిపేస్తూ భారతదేశపు అగ్రశ్రేణి డైరెక్టర్ల జాబితాలో మరింత ఉన్నత స్థానానికి చేరుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. మొత్తంగా చూస్తే అట్లీ చుట్టూ జరుగుతున్న పరిణామాలు ఆయన సినీ ప్రయాణానికే కాకుండా సౌత్-నార్త్ కల్చరల్ కొలాబరేషన్‌కు కూడా పెద్ద ఊపునిస్తున్నాయి.


రాకా తర్వాత అట్లీ చేయబోయే ప్రాజెక్టులు ఇండియన్ సినిమా బాక్సాఫీస్ లెక్కలను పూర్తిగా మార్చేయడం తథ్యం. బాలీవుడ్ స్టార్ హీరోలు సైతం అట్లీ డేట్స్ కోసం పోటీ పడుతున్న తరుణంలో అట్లీ ఎలాంటి సం చలనాలకు తెరలేపుతారనేది సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

# రామ్ చరణ్ -తారక్-ప్రభాస్ సీన్ లోకి వచ్చేదెప్పుడు?



తెలుగు చిత్ర పరిశ్రమలో మారుతున్న వ్యాపార సరళికి అనుగుణంగా స్టార్ హీరోలు కేవలం నటనకే పరిమితం కాకుండా అడుగులు వేరే రంగాల వైపు కూడా వేస్తున్నారు. ఇప్పటికే టాలీవుడ్‌లో మహేష్, అల్లు అర్జున్, విజయ్ దేవరకొండ, రవితేజ లాంటి అగ్ర హీరోలు మల్టీప్లెక్స్ - థియేట్రికల్ బిజినెస్‌లోకి అడుగుపెట్టి విజయవంతంగా వ్యాపారాలను విస్తరిస్తున్నారు. ఏషియన్ సినిమాస్ తో కలిసి మహేష్ ఏఎంబీ సినిమాస్ ద్వారా ఈ ట్రెండ్‌కు శ్రీకారం చుట్టగా, బన్నీ అల్లు సినిమాస్ రూపంలో ఈ రంగంలోకి దిగారు. ఇలా మిగతా హీరోలు కూడా థియేటర్ల వ్యాపారంలో రాణిస్తుండటంతో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, యంగ్ టైగర్ ఎన్టీఆర్, పాన్-ఇండియా స్టార్ ప్రభాస్ లాంటి టాప్ స్టార్స్ ఎప్పుడు ఎంట్రీ ఇస్తారనే చర్చ ట్రేడ్ వర్గాల్లో - అభిమానుల్లో మొదలైంది. అభిమానులు కోరుకుంటున్నట్లుగానే ఈ అగ్ర హీరోలు మల్టీప్లెక్స్ బిజినెస్‌లోకి ప్రవేశించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే కాలక్రమేణా మారుతున్న పరిస్థితుల్లో చిన్న చిన్న డిస్ట్రిబ్యూటర్లు, థియేటర్ యజమానులు భారీ మల్టీప్లెక్స్‌లను నిర్వహించడం ఆర్థికంగా భారంగా మారుతోంది. నిరంతరం అప్‌గ్రేడ్ అవుతున్న టెక్నాలజీ, సౌండ్ సిస్టమ్స్, లగ్జరీ సీటింగ్ ఏర్పాట్లు చేయడం చిన్న స్థాయి థియేటర్ల యజమానులకు కష్టతరంగా మారింది. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా వందలాది సంఖ్యలో సింగిల్ స్క్రీన్ థియేటర్లు ఇప్పటికే మూతపడ్డాయి. మరికొన్ని ఇతర వ్యాపార సముదాయాలుగా మారిపోయాయి. ఈ ప్రమాదకర పరిస్థితిని నివారించాలంటే టాలీవుడ్‌లోని ఆర్థికంగా బలమైన టాప్ హీరోలు రంగంలోకి దిగడం అత్యంత అవసరంగా మారింది. థియేటర్ల సంస్కృతిని, సినిమా ప్రదర్శనారంగాన్ని కాపాడుకోవడం అనేది ప్రేక్షకుల అవసరం మాత్రమే కాదు. అంతకంటే ఎక్కువగా ఇండస్ట్రీని నడిపిస్తున్న హీరోలకు, నిర్మాతలకు అత్యంత ప్రాణాధారమైన విషయం. సినిమాకు కోట్లాది రూపాయల బడ్జెట్ పెట్టి ప్రొడ్యూస్ చేస్తున్నప్పుడు ఆ సినిమాను ఆడేందుకు సరైన స్క్రీన్లు అందుబాటులో లేకపోతే కలెక్షన్లపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఓటీటీల హవా విపరీతంగా పెరిగిన రోజుల్లో థియేటర్లకు వచ్చి సినిమా చూసే అనుభూతిని ప్రేక్షకులు కోల్పోకుండా ఉండాలంటే పటిష్టమైన థియేట్రికల్ నెట్‌వర్క్ ఉండాలి. సింగిల్ స్క్రీన్లను పూర్తిగా కోల్పోకుండా వాటి స్థానంలో ఆధునిక హంగులతో కూడిన మల్టీప్లెక్స్‌లను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత చిత్ర పరిశ్రమ పెద్దలపై ఉంది. ఈ నేపథ్యంలో రామ్ చరణ్, ఎన్టీఆర్, ప్రభాస్‌లాంటి గ్లోబల్ స్టార్స్ తమ సినిమాల విజయాలకే పరిమితం కాకుండా థియేట్రికల్ రంగంలోకి పెట్టుబడులు పెట్టడం ద్వారా ఇండస్ట్రీకి బలమైన భద్రతను కల్పించొచ్చని నిపుణులు భావిస్తున్నారు. వారికున్న ఆర్థిక సామర్థ్యంతో పాటు విశాలమైన ఫ్యాన్ బేస్‌ను ఉపయోగించి తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా ఇతర ప్రాంతాల్లోనూ అత్యాధునిక మల్టీప్లెక్స్ చైన్‌లను ఏర్పాటు చేసే అవకాశం ఉందంటున్నారు. దీని వల్ల సినిమాల విడుదలకు థియేటర్ల కొరత సమస్య ఎప్పటికీ తలెత్తదు. అంతే కాదు ఇతర చిన్న, మధ్యతరహా సినిమాలకు కూడా సరైన స్క్రీన్ కౌంట్ దక్కేలా చేయడానికి అగ్ర హీరోల థియేటర్ల నెట్‌వర్క్ ఎంతగానో దోహదపడుతుందని అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా చూస్తే టాలీవుడ్‌ను శాసించే అగ్ర హీరోలు సినిమా నిర్మాణంతో పాటు థియేట్రికల్ ఎగ్జిబిషన్ రంగంలోనూ తమ ప్రభావాన్ని చూపాల్సిన సమయం ఆసన్నమైంది. సింగిల్ స్క్రీన్‌ల కనుమరుగును అడ్డుకుంటూ సరికొత్త మల్టీప్లెక్స్ హంగులతో థియేటర్ రంగాన్ని బతికించుకోవాల్సిన బాధ్యత ఉంది. రామ్ చరణ్, తారక్, ప్రభాస్ లాంటి దిగ్గజాలు కూడా ఈ బిజినెస్‌లోకి ప్రవేశిస్తే తెలుగు సినిమా రంగానికి వస్తున్న సరికొత్త విప్లవం మరింత బలోపేతం అవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

# టాలీవుడ్ గోల్డెన్ లెగ్.. నెక్స్ట్ ఏంటంటే..




టాలీవుడ్‌లో ఇప్పుడు రితికా నాయక్ పేరు ఓ బ్రాండ్‌లా మారిపోయింది. ఈమె ఏ సినిమా చేస్తే అది కచ్చితంగా హిట్ అవుతుందనే సెంటిమెంట్ బలంగా పెరుగుతోంది. అశోక వనంలో అర్జున కళ్యాణం మూవీతో ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ, ఆ తర్వాత హాయ్ నాన్న, మిరాయ్ తో హిట్స్ కొట్టింది. లేటెస్ట్‌గా వరుణ్ తేజ్ కొరియన్ కనకరాజు కూడా సూపర్ హిట్ అవ్వడంతో ఇండస్ట్రీ అంతా ఆమెను లక్కీ చార్మ్‌గా భావిస్తోంది. వరుస విజయాలతో గోల్డెన్ లెగ్ ఇమేజ్ సొంతం చేసుకుంది. ఆఫర్స్ వస్తున్నాయి కదా అని ఏది పడితే అది ఒప్పుకోకుండా చాలా తెలివిగా అడుగులు వేయడం రితికా స్పెషాలిటీ. స్క్రీన్ మీద క్యారెక్టర్‌కి మంచి స్కోప్ ఉండేలా చూసుకుంటుంది. క్వాలిటీకి పక్కా అంటూ కెరీర్‌ని ప్లాన్డ్‌గా నిర్మించుకుంటోంది. ప్రస్తుతం తెలుగు, తమిళ భాషల్లో తెరకెక్కుతున్న డ్యూయెట్ ప్రాజెక్ట్ తో ఆసక్తి రేపుతోంది. ఇలా సెలెక్టివ్‌గా వెళ్లడం వల్లే సక్సెస్ ట్రాక్ పక్కాగా కొనసాగిస్తోంది. ఇక నెక్స్ట్ ఈ బ్యూటీ నుంచి రానున్న ప్రాజెక్ట్ మీద ఫోకస్ పడుతోంది.

టాలెంటెడ్ యాక్టర్ సందీప్ కిషన్‌తో కలిసి పవర్ పేట అనే సినిమాలో నటించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దాదాపు 25 కోట్ల బడ్జెట్‌తో ఈ సినిమాను చాలా గ్రాండ్ స్కేల్‌లో నిర్మిస్తున్నారు. సందీప్ కిషన్ కెరీర్‌లోనే ఇది ఒక హై బడ్జెట్ ప్రాజెక్ట్‌గా రాబోతోంది. దీంతో మరో సాలిడ్ హిట్ గ్యారెంటీ అని సినీ జనాలు అనుకుంటున్నారు. ఈ పవర్ పేట సినిమాను దర్శకుడు కృష్ణ చైతన్య డైరెక్ట్ చేస్తున్నాడు. రౌడీ ఫెలో, చల్ మోహన్ రంగ, గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి లాంటి సినిమాలతో తనకంటూ ఒక ప్రత్యేకమైన మార్క్ క్రియేట్ చేసుకున్నాడు. కంటెంట్‌ని చాలా డిఫరెంట్‌గా ప్రెజెంట్ చేయడంలో ఇతనికి మంచి పేరు ఉంది. కృష్ణ చైతన్య డైరెక్షన్‌కు భారీ బడ్జెట్ తోడవడంతో ఈ సినిమాపై మేకర్స్ ఎంతో కాన్ఫిడెంట్‌గా ఉన్నారు. ఈ మూవీలో రితికా నాయక్ క్యారెక్టర్‌కి చాలా మంచి స్కోప్ ఉందని, ఆమె యాక్టింగ్ సినిమాకి పెద్ద ప్లస్ అవుతుందని తెలుస్తోంది. మంచి రోల్స్ చూసుకునే రితికా ఈ ప్రాజెక్ట్ ఒప్పుకుందంటే కంటెంట్ లో స్టఫ్ గట్టిగానే ఉంటుంది. ఇప్పటికే టాలీవుడ్‌కి లక్కీ చార్మ్‌లా మారిన ఈ భామ లక్, ఈసారి సందీప్ కిషన్‌కు కూడా బాగా కలిసి వస్తుందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. వరుస ప్రాజెక్ట్స్‌తో దూసుకుపోతున్నా, రితికా ఇంకాస్త స్పీడ్ పెంచితే బాగుంటుందని ఇండస్ట్రీ పెద్దలు చెబుతున్నారు. ట్రెండ్స్ వేగంగా మారుతున్న ఈ టైమ్‌లో, ఆఫర్స్ వచ్చినప్పుడే ఫాస్ట్‌గా సినిమాలు సైన్ చేయడం మంచిదని సూచిస్తున్నారు. ఏదేమైనా క్వాలిటీ విషయంలో కాంప్రమైజ్ కాకుండా, తనదైన స్టైల్‌లో హిట్స్ కొడుతూ ఇండస్ట్రీలో మోస్ట్ వాంటెడ్‌గా ఎదిగిపోయింది. ఇక పవర్ పేట సినిమాతో ఈ సక్సెస్ స్ట్రీక్ ఇంకా ఈ స్థాయికి వెళుతుందో చూడాలి.

# కూటమి ప్రభుత్వంలో విద్యకు అధిక ప్రాధాన్యత

### - మంత్రి నారా లోకేష్ నూతన వరవడి - చదువుపై ఏకాగ్రత కలిగించాలి - స్కూలు భవనం, ఎంఈఓ కార్యాలయం ప్రారంభం : మంత్రి కొండపల్లి శ్రీనివాస్








**గజపతినగరం, (రాజధాని వార్తలు):** కూటమి ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత కల్పిస్తుందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం గజపతినగరం నియోజకవర్గం దత్తిరాజేరు మండల కేంద్రంలో 2 కోట్ల 12 లక్షల రూపాయలతో నిర్మించిన కస్తూరిబా బాలికల అప్గ్రేడ్ జూనియర్ కళాశాల భవన సముదాయాన్ని, 53 లక్షల రూపాయలతో నిర్మించిన మండల విద్యాశాఖ అధికారి భవన సముదాయాన్ని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలనే సంకల్పంతో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. పాఠశాల ప్రారంభ సమయంలోనే యూనిఫామ్, షూస్, పుస్తకాలు అందించడంతోపాటు, డొక్కా సీతమ్మ పేరిట నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించడం జరుగుతుందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సారధ్యంలో నూతన వరవడితో ఒక ప్రణాళిక బద్ధంగా చిన్నారులకు తర్ఫీదును అందించడంతోనే 2025-2026 సంవత్సరంలో పదవ తరగతి పరీక్షా ఫలితాలలో ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు సత్తా చాటటం జరిగిందన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులకు చదువుపై ఏకాగ్రత కలిగించాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో అవగాహన కలిగేలా నేర్పరితనంతో, పాఠ్యాంశాలను బోధించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం పాఠశాలల్లో కావలసిన అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడంతోపాటు తల్లికి వందనం అందజేసి విద్యార్థులను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. మెరుగైన వసతులు కల్పించడంలో భాగంగా స్కూలు భవనం విద్యా వనరుల కేంద్రం భవనాలు ప్రారంభించటం జరిగిందన్నారు. విద్యార్థులు సైతం చదువుపై ఏకాగ్రతతో ముందుకు సాగాలని, చదువు ద్వారా కుటుంబ ఆర్థిక పరిస్థితులు మెరుగుపరుచుకోవచ్చని, ప్రణాళికా బద్ధంగా చదువుకుని మంచి భవిష్యత్తును పొందాలని సూచించారు. కస్తూరిబా బాలికలతో పాఠశాల గదులను రిబ్బన్ కట్ చేయించి చిన్నారుల హర్షధ్వానాల మధ్య మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు ప్రారంభించారు. విద్యార్థుల బాగోగులు, పాఠశాల ఉపాధ్యాయుల పనితీరు, భోజనాల రుచి, మౌలిక వసతులు గురించి మంత్రి కొండపల్లి అడిగి తెలుసుకున్నారు. పాఠశాల నూతన భవన ప్రారంభం సందర్భంగా ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, కూటమి నాయకులు గ్రామ పెద్దలు విద్యార్థులు మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి, ఏఎంసీ చైర్మన్ పివివి గోపాలరాజు, బిజెపి నాయకులు రెడ్డి పావని, మండల పార్టీ అధ్యక్షులు చప్పా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## గురజాడ నడయాడిన గడ్డపై ప్రతిష్టాత్మక శ్రీశ్రీ కళా వేదిక



**విజయనగరం, (రాజధాని వార్తలు):** 36 ప్రపంచ రికార్డులు సాధించిన శ్రీ శ్రీ కళా వేదికకు చెందిన గోడ పత్రికను రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై సాధికారత సంబంధాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ శనివారం ఉదయం తన కార్యాలయంలో ఆవిష్కరించారు.

అతిపెద్ద అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థగా ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిన శ్రీ శ్రీ కళా వేదిక విజయనగరం జిల్లాలో సముద్రాల గురు ప్రసాద్ కన్వీ నర్‌గా ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గానికి సంబంధించిన ప్రత్యేక గోడపత్రికను మంత్రి కొండపల్లి ఆవిష్కరించారు. గురజాడ నడయాడిన గడ్డపై ప్రతిష్టాత్మక శ్రీ శ్రీ కళా వేదిక విజయనగరంలో ప్రారంభించబడటం సంతోషదాయకమని కళారత్న డాక్టర్ కత్తిమండ ప్రతాప్ చైర్మన్‌గా, ఈశ్వరీ భూషణం జాతీయ అధ్యక్షులుగా నడుస్తున్న శ్రీశ్రీ కళావేదిక సేవలు విజయనగరం జిల్లాలో కూడా ఇకపై కొనసాగుతాయని గురు ప్రసాద్ పేర్కొన్నారు.

## నూతన తాగునీటి చేతి బోరు ప్రారంభం





**రేణిగుంట, (రాజధాని వార్తలు):** రేణిగుంట మండలం మామండూరు గ్రామంలో పద్మ మహిళా మండలి ఆధ్వర్యంలో నూతనంగా వేసిన తాగునీటి బోరుకు గ్రామస్తులు శనివారం ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. మామండూరు గ్రామంలో తాగునీటి సమస్య ఉండడంతో గ్రామస్తులు పద్మ మహిళా మండలి ప్రాజెక్ట్ ఆఫీసర్ జూలియన్ రాజు దృష్టికి తీసుకు వెళ్లడంతో ఆయన అక్కడ సమస్యను గుర్తించి నూతనంగా బోరు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల నుంచి రేణిగుంట మండలంలో ప్రభుత్వ సాయంతో పాటు పద్మ మహిళా మండలి సంస్థ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో, గిరిజన కాలనీలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చేతి బోర్లు వేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఐదు బోర్లు ఐదు గ్రామాల్లో వేస్తున్నామని అన్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ తాగునీటి ఇబ్బంది ఉందని చెప్పిన వెంటనే స్పందించి బోర్ వేసిన రాజు సార్‌కి కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు.

ఈ కార్యక్రమంలో మామండూరు ఎకో టూరిజం ప్రాజెక్ట్ చైర్మన్ కుమారస్వామి ముదిరాజ్, అమ్ములు రాజు, గీతా, శ్యామల, రాజేశ్వరి, దేవిక తదితరులు పాల్గొన్నారు.

# మెగా డీఎస్సీపై సి.బి.ఐ దర్యాప్తు చేపట్టాలి

### - మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్







**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మెగా డీఎస్సీపై సి.బి.ఐ దర్యాప్తు చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త బొత్స అప్పలనరసయ్య, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మూడో రోజుకు చేరుకున్న రిలే నిరాహార దీక్షా శిబిరంలో వారు పాల్గొని తమ సంఘీభావాన్ని తెలిపారు. మూడో రోజు దీక్షలో పాల్గొన్న గజపతినగరం, గంట్యాడ మండలాలకు చెందిన వైఎస్ఆర్సిపి యువత, విద్యార్థులకు పూలదండలు వేసి దీక్షలో కూర్చోబెట్టి మద్దతుగా నిలిచారు. అనంతరం మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ, డీఎస్సీ అక్రమాలకు బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాల్సిందేనని ఉద్ఘాటించారు. తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు కూటమీ ప్రభుత్వం తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తుందని విమర్శించారు. స్పోర్ట్స్ కోటా కింద భర్తీ చేసిన 400 వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు అమ్ముకుని సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. అయినా ఈ ప్రభుత్వం తప్పించుకునే ధోరణి ప్రదర్శిస్తుందని విమర్శించారు. నిరుద్యోగ యువతను పూర్తిగా ఈ ప్రభుత్వం మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా స్పోర్ట్స్ కోటా కింద ఎటువంటి పోటీ పరీక్ష నిర్వహించకుండా నేరుగా ఉద్యోగాలు కల్పించడం వెనక భారీ కుట్ర దాగి ఉందన్నారు. పోలీసుల అనుమతులతో శాంతియుతంగా చేస్తున్న నిరాహార దీక్షలను సైతం అధికార పార్టీ నాయకులు భగ్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం నేత బోండా ఉమా చంద్రబాబు వద్ద మార్కులు కోసం అనవసర ప్రేలాపన చేస్తున్నారని దుయ్యబట్టారు. మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య మాట్లాడుతూ, రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అక్రమాలు, అవినీతిని ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయిస్తూ.. అరెస్టులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. పోలీసులు పూర్తిగా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

ఈ రెండున్నర ఏళ్ల పాలనలో కూటమి ప్రభుత్వం 3 లక్షల 63 వేల కోట్ల రూపాయలు అప్పు చేసిందని, ఈ డబ్బు ఎవరి జేబుల్లోకి వెళ్లిందని ప్రశ్నించారు. తమ ప్రభుత్వ హయాంలో అప్పు చేసిన ప్రతి పైసాను అభివృద్ధి, ప్రజాసంక్షేమానికి ఖర్చు చేశామని అన్నారు.

రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని, ఎన్నికల హామీలు గాలికి వదిలేసారని.. మరి అప్పులు చేసిన డబ్బు ఏమి చేశారని ప్రశ్నించారు. 9,500 కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థులు భవిష్యత్తుతో ఆటలాడుతున్నారని దుయ్యబట్టారు.

ఈ కార్యక్రమంలో అప్పల నరసయ్య తనయుడు, యువనేత బొత్స సాయి గురునాయుడు, మండల నాయకులు మండల సురేష్, కరణం ఆదినారాయణ, జడ్పిటిసిలు గార తౌడు, వర్రి నరసింహమూర్తి, ఎంపీ పీలు పీరు బండి హైమావతి, బెల్లాన జ్ఞానదీపిక, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ కోఆర్డినేటర్ బూడి వెంకటరావు, మండల పార్టీ అధ్యక్షులు పల్లి సంజీవరావు, జాగారపు అప్పారావు, మాజీ ఎంపీపీ కంది తిరుపతి నాయుడు, మాజీ ఏ.ఎం.సి. చైర్మన్ వేమలి ముత్యాల నాయుడు,యూత్ విభాగం నియోజకవర్గం కన్వీనర్ కె. పైడిపినాయుడు, మండల కన్వీనర్ కర్రీ లక్ష్మణ, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు బెల్లాన త్రినాధరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## డీఎస్సీ అక్రమాలపై మంత్రి లోకేష్ రాజీనామా చేయాలి

### - వైసిపి రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రరాజీనామా పూజిత రెడ్డి

**గూడూరు, (రాజధాని వార్తలు):** డీఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలకు మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని వైసిపి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాని పూజిత రెడ్డి డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంపై నిరుద్యోగులు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారని డీఎస్సీలో జరిగిన అవకతవకలతో అర్హులైన ఎంతో మందికి ఉద్యోగాలు రాకుండా పోయాయని యువతకి అండగా జగన్మోహన్ రెడ్డి ఉన్నారని యువత తలుచుకుంటే కేంద్రమంత్రితోనే రాజీనామా చేయించారని వైసిపి మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాని పూజిత వెల్లడించారు. శనివారం గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద వైసీపీ నియోజకవర్గ ఇన్చార్జి గురవయ్య ఆధ్వర్యంలో మూడో రోజు రిలే దీక్షలు కొనసాగాయి రిలే దీక్షలకు వైసీపీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పూజిత మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్న లేకపోయినా నిరుద్యోగులకు అండగా నిలుస్తున్నాడని...తప్పు చేసిన వారికి ఈ దీక్షలు కష్టంగా ఉన్నాయన్నారు...దీక్షలు మొదలైనప్పటినుండి దాడులు జరుగుతున్నాయని...డీఎస్సీలో జరిగిన అక్రమలపై నిరుద్యోగులకు తీవ్ర అసంతృప్తి ఉందని తెలిపారు...యువతని ఎవరు ఆపలేరు...ఈ ఆందోళనలు ఇక్కడితో ఆగవని స్పష్టం చేశారు...యువత చేసిన ఉద్యమాలకు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని...ఆయన కన్నా లోకేష్ ఎక్కువ కాదని తెలిపారు..డీఎస్సీలో జరిగిన అక్రమాలకు బాధ్యత వహిస్తూ లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు...కూటమి ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని.. ప్రభుత్వాన్ని గద్దె దించే రోజులు త్వరలో ఉన్నాయని స్పష్టం చేశారు... నియోజకవర్గ ఇన్చార్జి గురవయ్య మాట్లాడుతూ డీఎస్సీ అవకతవకలతో ఉద్యోగాలకు కోల్పోయిన వారందరికీ జగన్ మోహన్ రెడ్డి అండగా ఉంటారని వైసీపీ ప్రభుత్వం వస్తే వారికి న్యాయం చేయడం జరుగుతుందని కుటమి ప్రభుత్వం ఇప్పటికైనా డీఎస్సీ అక్రమాలపై సిబిఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సభ్యులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, వేమారెడ్డి కుమార్ స్వామి రెడ్డి, గూడూరు పట్టణ వైసీపీ అధ్యక్షులు బొమిడి శ్రీనివాసులు, నాయకులు మీరా రెడ్డి కొండూరు సునీల్ రెడ్డి బాలకృష్ణారెడ్డి, యమునమ్మ, శారద, సుకన్య కొట్టు గోవర్ధన్ బల్లి వెంకటేశ్వర్లు, సుబ్బానాయుడు, ప్రసాద్, జనార్ధన్ రెడ్డి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కంచి లతీష్ ఆధ్వర్యంలో మహేష్ బాబు జన్మదిన వేడుకలు






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని సంతపేట ఆంజనేయ స్వామి దేవస్థానంనందు ప్రిన్స్ మహేష్ బాబు జన్మ దినం సందర్భంగా దేవస్థానం ధర్మకర్త మరియు మహేష్ బాబు ఫ్యాన్స్ నెల్లూరు జిల్లా జనరల్ సెక్రెటరీ కంచి లతీష్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 50 సంవత్సరాలు పూర్తి చేసుకుని 51వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా మొదటగా పూజ కార్యక్రమం మూవీ సెలబ్రేషన్స్ పోస్టర్ లాంచ్ రక్తదాన శిబిరం మొక్కలు నాటే కార్యక్రమం అన్నదానం టవల్స్ పంపిణీ కేక్ కటింగ్ కార్యక్రమాన్ని చేస్తున్నాం ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఇంకా మరెన్నో సినిమాలు తీయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం. ఈ కార్యక్రమంలో మహేష్ బాబు ఫ్యాన్స్ నెల్లూరు సిటీ ప్రెసిడెంట్ వాయుగుండ్ల ప్రసాద్.మహేష్ బాబు ఫ్యాన్స్ నెల్లూరు జిల్లా జనరల్ సెక్రెటరీ కంచి లతీష్. మహేష్ బాబు ఫ్యాన్స్ నెల్లూరు జిల్లా వైస్ ప్రెసిడెంట్ రాణ జావిద్. మహేష్ బాబు ఫ్యాన్స్ నెల్లూరు సిటీ ట్రెజరర్ ఎస్ మహేష్ బాబు. జై కృష్ణ ఫ్యాన్స్ నెల్లూరు జిల్లా అధ్యక్షులు ఏ రోషన్. కృష్ణ మహేష్ బాబు ఫ్యాన్స్ నెల్లూరు జిల్లా అధ్యక్షులు సిరాజ్. తదితరులు పాల్గొన్నారు.

# మహేష్ బాబు ఆధ్వర్యంలో కేక్ కటింగ్ భారీ అన్నదానం






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని నర్తికి సెంటర్ నందు సూపర్ స్టార్ మహేష్ బాబు జన్మదినాన్ని పురస్కరించుకొని మహేష్ బాబు ఫ్యాన్స్ సిటీ ట్రెజరర్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. విజయనగరం మా అభిమాన నటుడు ప్రిన్స్ మహేష్ బాబు జన్మదినం సందర్భంగా ఉదయం నుంచి పూజా కార్యక్రమాలతో స్టార్ట్ అయి ప్రోగ్రామ్స్ అన్ని విజయవంతం చేసాం మా అభిమాన హీరో మహేష్ బాబు ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని మరి నువ్వు బ్లాక్ బస్టర్ సినిమాలు తీయాలని ఆ దేవదేవుడు ఆశీస్సులు మా ప్రిన్స్ మహేష్ బాబు పైన ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాగుంట నిఖిల్ బాబు. మహేష్ బాబు ఫ్యాన్స్ నెల్లూరు సిటీ ప్రెసిడెంట్ వాయుగుండ్ల ప్రసాద్. మహేష్ బాబు ఫ్యాన్స్ నెల్లూరు జిల్లా జనరల్ సెక్రెటరీ కంచి లతీష్. మహేష్ బాబు ఫ్యాన్స్ నెల్లూరు జిల్లా వైస్ ప్రెసిడెంట్ జావిద్. మహేష్ బాబు ఫ్యాన్స్ నెల్లూరు సిటీ ట్రెజరర్ ఎస్ మహేష్ బాబు. జై కృష్ణ ఫ్యాన్స్ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు రోషన్. కృష్ణ మహేష్ బాబు ఫ్యాన్స్ నెల్లూరు జిల్లా అధ్యక్షులు ఎస్ కే సిరాజ్. నెల్లూరు సిటీ మహేష్ బాబు ఫ్యాన్స్ కమిటీ శివ. మన్సూర్. రాహుల్. మున్నా, తదితరులు పాల్గొన్నారు.

# అక్కరపాక రోషన్ ఆధ్వర్యంలో మహేష్ బాబు జన్మదిన వేడుకలు




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని ప్రిన్స్ మహేష్ బాబు జన్మదినాన్ని పురస్కరించుకొని మినీ బైపాస్ అనిల్ గార్డెన్ వివేకానంద పార్కు నందు పూల చెట్లు నాటే కార్యక్రమం నిర్వహించారు. మా అభిమాన హీరో మహేష్ బాబు ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని మరెన్నో బ్లాక్ బస్టర్ సినిమాలు తీయాలని ఆ దేవదేవుడు ఆశీస్సులు మా మహేష్ బాబు పైన ఉండాలని కోరుకుంటూ ముఖ్య అతిథులుగా మహేష్ ఫ్యాన్స్ సిటీ అధ్యక్షులు ప్రసాద్ జిల్లా జనరల్ సెక్రటరీ కంచి లతీష్. వైస్ ప్రెసిడెంట్ జావిద్. సిటీ కోశాధికారి ఎస్ మహేష్ బాబు,



సైఫ్ అలీ. సమీర్, అధిక సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

# వాయుగుండ్ల ప్రసాద్ ఆధ్వర్యంలో మహేష్ బాబు జన్మదిన వేడుకలు




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని ప్రిన్స్ మహేష్ బాబు జన్మదినాన్ని పురస్కరించుకొని ఎస్2 సినిమా థియేటర్ నందు ఫ్రీ రిలీజ్ దూకుడు సినిమా వీక్షించి సందడి చేశారు. అదేవిధంగా రెడ్ క్రాస్ నందు బ్లడ్ డొనేషన్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో మహేష్ బాబు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని బ్లడ్ డొనేషన్ చేయడం జరిగింది. మా అభిమాన హీరో మహేష్ బాబు ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని మరెన్నో బ్లాక్ బస్టర్ సినిమాలు తీయాలని ఆ దేవదేవుడు ఆశీస్సులు మా మహేష్ బాబు పైన ఉండాలని కోరుకుంటూ ముఖ్య అతిథులుగా మా గుంట నిఖిల్ బాబు, మహేష్ ఫ్యాన్స్ జిల్లా జనరల్ సెక్రటరీ కంచి లతీష్. వైస్ ప్రెసిడెంట్ జావిద్. సిటీ కోశాధికారి ఎస్ మహేష్ బాబు. జై కృష్ణ ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షుడు అ రోషన్. సైఫ్ అలీ. సమీర్. అధిక సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

# చేనేత కుటుంబాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

## - అనకాపల్లి జిల్లాలో 288 చేనేత కుటుంబాలకు రూ.72 లక్షల ఆర్థిక సహాయం






**అనకాపల్లి (పాయకరావుపేట), (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లాలో పాయకరావుపేట చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్ర వారం జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగల పూడి అనిత, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు చేనేత కార్మికుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న 'చేనేత సేవలు' పథకం ద్వారా అనకాపల్లి జిల్లాలోని 288 చేనేత కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి రూ. 25,000 చొప్పున మొత్తం రూ. 72 లక్షల ఆర్థిక సహాయాన్ని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. అదేవిధంగా పాయకరా వుపేట నియోజకవర్గంలోని చేనేత మహిళా సంఘాల సభ్యులకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రూ. 3.27 కోట్ల విలువైన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ, చేనేత రంగం మన దేశ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోందన్నారు. చేనేత కార్మికుల కష్టాన్ని, నైపుణ్యాన్ని గుర్తించి వారి ఆర్థిక, సామాజిక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు చేనేత కుటుంబాల సంక్షేమా నికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. 'చేనేత సేవలు' పథకం ద్వారా ప్రతి చేనేత కుటుంబానికి రూ. 25,000 ఆర్థిక సహాయం అందించడం చేనేత కార్మికులకు ఎంతో ఉపయోగ కరమన్నారు. చేనేత కుటుంబాలు ఈ అవకాశాలను సద్విని యోగం చేసుకుని ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని ఆమె ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ చేనేత కార్మికుల సంక్షేమం వారి జీవన ప్రమాణాల మెరుగుదలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి చేరేలా జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. అనకాపల్లి జిల్లాలో 288 చేనేత కుటుంబాలకు రూ. 72 లక్షల ఆర్థిక సహాయం అందించడం సంతోషకరమైన విషయమన్నారు. చేనేత రంగంలో మహిళా సంఘాలను ప్రోత్సహించడం ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు, ఆర్థిక స్వావలంబన కల్పిం చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పాయకరా వుపేట నియోజకవర్గ చేనేత మహిళా సంఘాలకు రూ. 3.27 కోట్ల నిధులు అందించడం ద్వారా వారి కార్యకలాపాలకు మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. చేనేత కార్మికులు ఎదుర్కొం టున్న సమస్యలను గుర్తించి, వారికి అవసరమైన ప్రభుత్వ సహాయాన్ని అందించేందుకు జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని కలెక్టర్ తెలిపారు. చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించి, చేనేత కుటుంబాల ఆదా యాన్ని పెంచేందుకు సమన్వయంతో చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పేదిరెడ్డి చిట్టిబాబు, రాష్ట్ర నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్,



రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పల్లా విలియం కేరి, జిల్లా చేనేత మరియు జౌళి శాఖ అధికారి ఎం. యశ్వంత్, డి ఆర్ డి ఎ పీడి శచీదేవి, పాయకరావుపేట మండల అధ్యక్షులు చింతాలపు ప్రదీప్, టౌన్ ప్రెసిడెంట్ యాళ్ల వరహాలు, పాండు రంగస్వామి వారి దేవస్థానం చైర్మన్ మజ్జురి నారాయణ రావు తదితర నాయకులు, కార్యకర్తలు, చేనేత సంఘాల ప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

